# పరివర్తన

★ శ్రీమతి వెల్లంకి అన్నపూర్ణాదేవిగారు

అప్పుడే భోజనాలైనవి. ఇంటిపనులన్నీ చక్కబెట్టుకొని వాణి తనగదిలో కూర్చొని పత్రిక చదువుచున్నది. ఆమె అత్తగారు వెంకమ్మగారు సనాతనాచారపరురాలు. ఆమెకు వాణి పద్ధతులు నచ్చవు. కోడలు బయటకు వెళ్లినదని భావించి తనలో తను గొణుగుకొనుచున్నది.

వెంకమ్మ: అయ్యో ఇదెక్కడి ఖర్మము. ఎప్పుడు చూచినా చదువుతునో, వ్రాస్తూనో ఉంటుంది. అదీ ఇదీ గాకపోతే మీటింగులంటూ పోతుంది. సిగ్గువిడచి పరాయి మగవాడితో మాట్లాడుతుంది. మాయింటి గౌరవమర్యాదలన్నీ మంటగలుపుచున్నది.

ఇంతలోనే పొరుగింటామె వస్తుంది. వస్తూనే—ఏమో, వెంకమ్మ వదినా. పనులైనవా. కోడలు ఏదీ. మీటింగులకని ఎక్కడికైనా వెళ్లినదా ఏం?

వెంకమ్మ (దుఃఖముతో) ఏం చెప్పను శేషమ్మవదినా. దానికి మానాభిమానాలులేవు. అసలు వాడు మంచివాడైతే దానిననేపనేముంది. ఏంరా అబ్బాయి అంటె నవ్వి ఊరుకుంటాడేగాని భార్యను అదమాయించడాయె. అంటూ కండ్లవెంట నీరు కారుస్తుంది.

శేషమ్మ (వ్యంగ్యంగా) నీకేమే చదువుకున్న కోడలు. అన్నీ తెలిసినది.

వెంకమ్మ (ఏడుస్తూ) ఏడేడుపద్నాలుగుతరాలకి యిలాంటి కోడలు నాకు వద్దు తల్లీ. నా విరోధులకుగూడా యిలాంటివాళ్లను కోడలుగా చేయవద్దని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను.

శేషమ్మ (ఓదారుస్తు) ఇప్పుడిట్లా అంటున్నావుగాని వదినా. మొదట నేను చెప్పితే విన్నావూ? చదువుకున్న వాళ్లను చేసుకొంటె గడ్డి తినిపిస్తుంది అని చెప్పలా? ఆ నాగమ్మను చేసుకొంటె నీకు అండాదండగా ఉండేదా! నాగమ్మ వాళ్లత్తను వంగుని చెంబైనా ముట్టుకోనీదు. ఇంటి పనంతా చేస్తుంది.

వెంకమ్మ (మరింత దుఃఖముతో) నాకు సుఖపడేగీతలేదు తల్లీ. (కొంచెము నేపూరుకుండి) యీ ఇంట్లో అదైనా ఉండాలి లేదా నేనైనా. వాడిని రానీ తేల్చుకుంటా.

వారిద్దరి సంభాషణ వాణి విన్నది. పెండ్లి అయి సంవత్సరమైనా కాలేదు. చదువుకొనే దినములలో విద్యాభ్యాసము పూర్తి అయిన తర్వాత తన తోటి సోదరీమణులకు తన జీవితాన్ని అర్పించాలని భావించేది. కాని పెండ్లి అయిన తరువాత తన భావాలకు స్వస్తి చెప్పాలని తెలియదు. అలా ఎప్పుడూ తలపోయనూలేదు. సనాతనపరురాలైన అత్తగారి అదమాయింపులకు లోనై ఉండాలని ఆసలే తెలియదు. వాణి విద్యావంతురాలు గనుక అత్తగారి మనస్సుకు బాధ కలిగించకుండాఉండటానికి ప్రయత్నించుచున్నది. ఇంటి పనులన్నీ నిర్వర్తించి, ఖాళీ సమయములో తనతోటి సోదరీమణులకు పేపర్లలోని వార్తలు, స్త్రీల సమస్యలను గురించి చెప్పుచుండేది. అత్తగారికి యివన్నీ గిట్టలేదు. వారిద్దరి సంభాషణ విన్ననాటినుండి, అత్తగారిని ఒప్పించటము ఎలాగా అని దీర్ఘముగా ఆలోచించ సాగినది.



ఇంట్లోపని నౌకర్లను ఏమీ ముట్టుకోనీయకుండా వాణి స్వయంగా చేయటము మొదలుపెట్టినది. విశ్రాంతిసమయములో సంభాషణద్వారా పత్రికలలోని వార్తలు, మనదేశ స్త్రీల కష్టాలు, ఇతరదేశాలలోని స్త్రీలనుగురించి నెమ్మది నెమ్మదిగా చెప్పటము మొదలుపెట్టినది. ఒకరోజున వాణి

పట్టణములోని స్త్రీలంతా ప్రభుత్వందగ్గరకు, ఆర్థిక స్వాతంత్ర్యము కావాలని, ఇప్పుడున్న హిందూ చట్టాని మార్చాలని అడగటానికి వెళ్లారని చెప్పినది. వెంకమ్మగారికి ఆశ్చర్యము కల్గినది. ఆ, ఆడాళ్లా! మొగాళ్లు లేకుండానే? సరే కాని చట్టం అన్నావు ఏమిటే? అన్నది. వాణి సంతోషముతో మనస్త్రీలకు ఆస్తిమీద హక్కు లేదు. అందువల్ల స్వతంత్రించి జీవించలేకుండా ఉన్నాము. ఏమీ పనిచేయలేకుండా ఉన్నాము. అందుకని చాలా సంవత్సరములనుండి మనదేశంలోని స్త్రీలు తండ్రి ఆస్తిలో సోదరులతోబాటు సమాన భాగం కావాలని, సమిష్టిగానున్నప్పుడు భర్త చనిపోతే అతని భాగము భార్యపంచుకొనే హక్కు కల్పించాలని, ఒక భార్య ఉండగా మరొకభార్యను ఏ పురుషుడు చేసుకోకూడదని ఆందోళన చేస్తున్నారు, అని చెప్పింది.

రెండవరోజున ఉదయాన్నే పొరుగింటామె శేషమ్మగారు వస్తూనే ఏమేవదినా? కోడలున్నదా ప్రచారానికి వెళ్లినదా? రేపురాత్రి మీటింగుటగా మనవూళ్లో. ఏం పాడుకాలమోనమ్మా! మొగాళ్లంటారని వెరపైనాలేకుండా నడిబజారులో ఆడాళ్లే మాట్లాడుతారట, అని అందుకుంది.

వెంకమ్మగారు(నవ్వుతూ)అవును శేషమ్మవదినా. నిన్ననే మావాణి చెప్పినది. మీటింగని, మాట్లాడటానికి ఎవరో వస్తారని చెప్పినది. నేను తెలియక ఎన్నిబాధలు పెట్టాను వాణిని. అది సుగుణవంతురాలు. మనంకూడా మీటింగుకి వెళ్లి వాళ్లు చెప్పేమాటలు చెవినేసుకొందాము. అంటూ కోడలినిపిలిచి వాణీ నిన్నచెప్పావే నాకు. స్త్రీలు ప్రభుత్వం దగ్గరకు తమకు ఆర్థిక స్వాతంత్ర్యము కల్గించమని వెళ్లారని. ఆ విషయాలు శేషమ్మ వదినెకుకూడా చెప్పు.

వాణి నవ్వుతూ—మామ్మగారు! వీరంతా తోడ్పడాలి అంటూ చెప్పసాగినది. అన్నీ విన్నతర్వాత వాణితో శేషమ్మగారు ఇలా అన్నది. సరేకానమ్మా రేపు ఇవన్నీ చెప్పుతారమ్మా? నేను, మాకోడలిని తీసుకొని తప్పకుండా వస్తా.

ఆరోజు ఏకాదశి. వాణి అత్తగారి పూజా ద్రవ్యములను సేకరించటములోను, అత్తగారికొరకు ఫలహారము తయారు చేయటములోను నిమగ్నురాలైయున్నది. ఇంతలోనే అత్తగారు—భోంచేసి కొంచెముసేపు విశ్రాంతి తీసుకోవాణీ! అప్పుడే ఒంటిగంటైనది. మూడింటికి మీటింగుకి వెళ్లాలిగదా. నాకొరకు ప్రొద్దుటినుండి చాలా శ్రమపడ్డావు. నావంటి వేలకొలది స్త్రీలకు సేవచేసేదానివి నీవు. కనుక వెళ్లి భోంచేయి తల్లీ అని అన్నది. అత్తగారి ప్రేమ పూరితమైన వాక్యాలనువిని వాణి పరమానందభరితురాలైనది. మానవుని కృషికి ఎదురులేదు. ఫలించి తీరుతుందని కృత నిశ్చయురాలైనది.

★

భయపడకుడు

సమస్తవ్యాధుల నివారణోపాయము తెలియజేయు "ప్రకృతి వైద్యము"ను గ్రంథము

0—8—0

పోస్టు బిళ్ళలకు పంపబడును.

శ్రీ యోగాశ్రమము (పోస్టు)

మునులతోట, (Via) రేపల్లె,

గుంటూరుజిల్లా.